# ఎంతైనా ఆడపిల్లని కదా...

**ఒక్కోప్పుడు** ఈ పెయింటు స్టోర్సులో ఎందుకు చేరానా అని నేను బాధపడుతూంటాను. కానీ తప్పదు. ఇంటరు దాటి ఆడపిల్లను చదివించడం వేస్టని నాన్న అభిప్రాయం. పెళ్లి చేయడానికి డబ్బు లేదు. మంచిరోజులు వస్తే కళ్యాణం దానంతట అదే అవుతుందని అమ్మా, నాన్నా ఇద్దరి అభిప్రాయం. అలా అని నేను కూడా ఇంట్లో కూచుని మంచిరోజుల కోసం ఎదురుచూస్తూంటే అమ్మకు బాధ.

"ఆ ఎదురింటి వాళ్ల అమ్మాయి నర్సింగ్ హోమ్‌లో చీట్లు రాసి నెలకు నాలుగొందలు సంపాదిస్తోందట. పరికిణీ, జాకెట్టు ఖర్చైనా కలిసివస్తుంది. అలా డబ్బు కాస్త వెనకేస్తే రేపు కట్నానికైనా మిగులుతుంది. ఇంట్లో ఊరికే కూచుని పుస్తకాలు చదువుతూ కూచుంటే, ఎక్కడినుంచైనా రాజకుమారుడు ఊడిపడతాడా? ఉద్యోగం పేరుచెప్పి నలుగురి కంటా పడతారు. ఎవరికైనా పిల్ల నచ్చితే వాళ్లే వచ్చి అడిగి చేసుకుంటారు. వెంకమ్మగారమ్మాయికి అలాగేగా సంబంధం కుదిరింది" అని ఒకటే పోరు. ఆ బాధ భరించలేకనే ఈ ఉద్యోగంలో చేరింది.

ఇక్కడికొచ్చాక చూస్తే ఎవరికంటా పడేట్టు లేను. అసలు కస్టమర్లు రావడమే తక్కువ. గంటకు ఇద్దరు, ముగ్గురు రావడం అబ్బురం. ఆ వచ్చే వాళ్లయినా పెయింటు వేసే కుర్రాళ్లు, పనివాళ్లు. రంగులంటించుకున్న చొక్కాలు చూస్తేనే వికారం పుడుతుంది. రిటైరయ్యాక భుక్తి గడవక చేరిన వెంకట్రామయ్య గారికి చెవుడు కూడా. ఓనరు గారు కుర్రాడే కానీ షాపుకే సరిగ్గా రాడు. తండ్రిపోరు పడలేక షాపు పెట్టాడు కానీ ఇంట్రస్టు లేనట్టుంది. నాలుగురోజులకోసారి ఫ్రెండ్స్‌తో వచ్చి పదినిముషాలు ఉండి వెళిపోతాడు. చేరి నెల్లాళ్లయినా నా పేరు విజయ అని తెలుసో లేదో. 'కొత్త అమ్మాయి ఎలా చేస్తోంది?' అని అడుగుతాడు. వెంకట్రామయ్య గారు 'బుద్ధిమంతురాలే' అంటారు. చుప్పనాతి సుబ్బరత్నం గారు 'ఏదోలెండి' అంటుంది మూతివిరుచుకుంటూ.

కంటికి నదురుగా కనబడిన వాడు అతనొకడే. ఆవేళ శనివారం మధ్యాహ్నం వచ్చాడు. చాలా బిడియస్తుడని చూడగానే తెలిసిపోయింది. పెయింటు శాంపుల్ బిళ్లలన్నీ అట్నుంచి ఇటూ, ఇట్నించి అటూ తిరగేసి చూస్తున్నాడు. సుబ్బరత్నం గారు "ఏం కావాలయ్యా" అని ధాష్టీకంగా అడిగేటప్పటికి తడబడ్డాడు.

నాకు జాలి వేసింది. "నేను అటెండ్ అవుతున్నానండీ" అన్నాను సుబ్బరత్నంతో. అతను కృతజ్ఞతగా చూసాడు. నోరు పెగల్చుకుని "సోఫాకు ఏ రంగు బాగుంటుందంటారు?" అని అడిగాడు. నన్ను సలహా అడిగేవాడు ఇన్నాళ్లకి ఒకడు' దొరికాడు. ఉద్యోగంలో చేరేముందు రంగుల కంపెనీ వాళ్లు ఇచ్చిన రెండురోజుల ట్రయినింగు ఇప్పుడు పనికివచ్చింది. ఎటువంటి చెక్కకు, ఎటువంటి ఇంటికి ఏ రంగు నప్పుతుందో నేను లెక్చరు కొట్టాను. దెబ్బకు గుమ్మైపోయాడు, అంత పొడుగు మనిషి

ఎమ్బీయస్ ప్రసాద్



కుచించుకుపోయి నాకేసి అతి మర్యాదగా చూసాడు.

'ఆ పెద్ద ఛాతీ విరుచుకుని నిలుచుంటే బాగుంటుంది. నిటారుగ్గా నిలబడి నా కళ్లలోకి చూసి మాట్లాడితే బాగుంటుంది, ఆ గడ్డం పూర్తిగా పెంచినా బాగుంటుంది, లేదా సన్నగా షేవ్ చేసుకున్నా బాగుంటుంది, అంతేకానీ అలా షేబీగా ఉంటే బాలేదు. మరీ అంత భయం భయంగా ఉండడం దేనికి, మొగాడిలా, మొనగాడిలా దబాయించి అడగచ్చుగా' అని అనిపించింది. కానీ పైకి అనలేదు. ఎలా అంటాం?

అతను నా సలహా ప్రకారం అన్నీ కొంటూంటే నాకు భలే గర్వంగా అనిపించింది. అన్నీ మోసుకొని వెళుతూ గుమ్మంలో ఎవర్నో గుద్దేయబోయాడు. 'బుచ్చిబాబు' అని పిలవబుద్ధేసింది. 'బుద్ధూ' అన్నా తప్పులేదనిపించింది, గంటన్నర పోయాక మళ్లీ వచ్చినప్పుడు. బ్రష్ ఇంట్లో లేదుట. అన్ని పెయింట్లు కొన్నవాడికి బ్రష్ కొనాలని తెలీదూ.

'బ్రష్ గురించి అంతదూరం నుంచీ మళ్లీ వచ్చారా, మీ ఇంటి దగ్గర్లో షాపేదీ లేదూ?' అన్నా. 'రెండు, మూడు ఉన్నాయండి. కానీ ఏది మంచిదో మీ అంత బాగా ఎక్స్‌ప్లెయిన్ చేసి ఎవరు చెప్తారండీ?' అన్నాడు మా బుచ్చిబాబు. భలే సంతోషంగా అనిపించింది. సుబ్బరత్నం గారు ఆ మాట విని మొహం ముడుచుకున్న విధానం తలచుకుని ఆ రాత్రి నవ్వుకుంటూంటే అమ్మ చివాట్లేసింది కూడా – 'ఏవిటే ఆ వెర్రి నవ్వులు, ఆడపిల్లకు అంతనవ్వు మహాచేటు సుమా' అంటూ.

ఆ తరువాత ప్రతీ శనివారం అతను రావడం, ఏదో ఒకటి కొనడం. ఫారిన్ ఎడిషన్ 'డూ ఇట్ యువర్ సెల్ఫ్' పుస్తకం ఒకటి కొనుక్కొచ్చాడు. దాంట్లో పేర్లు చెప్పి ఉందా అంటాడు. 'ఆ పేర్లు వేరండీ, లోకల్‌గా వేరే పేర్లతో పిలుస్తారు. నేను చెబుతున్నానుగా పట్టుకెళ్లండి' అని నేను చెప్తే చాలు సరే, సరే అని బుర్ర ఊపేసి కొనేస్తాడు.

'అంతా నా సలహా మీదే కొనేస్తున్నారు. మీ ఆవిడకి కోపం వచ్చేస్తుందేమో జాగ్రత్త' అన్నా ఓసారి. 'బ్రహ్మచారిని కదా, ఆ బాధలు లేవు' అన్నారు నవ్వుతూ. అతని నవ్వు చూడడం అదే మొదటిసారి. పెళ్లి కాలేదని ముందే అనుకున్నాను. భార్య ఉంటే ఇంటి కలరింగ్ విషయంలో వేలు పెట్టకుండా ఉంటుందా? ఏమో, పురిటికి పుట్టింటికి వెళ్లిందేమో, సందర్భం చూసి ప్రస్తావిస్తే పోలా అనిపించింది. నేనాశించినట్టుగానే పెళ్లి కాలేదని చెప్పాడు.

'బ్రహ్మచారికి ఇంత జంఝాటం ఎందుకండీ బాబూ?' అన్నాను నవ్వుతూనే. వాళ్ల ఫ్యాక్టరీలో ఒకాయన దుబాయి వెళ్లిపోతూ ఇతనికి తన పాత ఫర్నీచరూ, సామానూ అంటగట్టి వెళ్లిపోయాట్ట. వాటికన్నింటికీ పెయింట్లు వేసి అందంగా చేద్దామని ఇతని తాపత్రయమంట. ఇతన్ని కట్టుకోబోయేది చాలా అదృష్టవంతురాలే. అదే ఆలోచనలో పడి అతనికి ఐదురూపాయల చిల్లర ఎక్కువ ఇచ్చేసాను. సుబ్బరత్నం గారు పట్టేసింది. నేను కట్టుకోవాల్సి వచ్చింది. మూడురోజులు బస్ మానేసి నడిచి రావలసి వచ్చింది.

పై శనివారం వచ్చినప్పుడు అతనికా విషయం చెప్పలేదు. చెబితే ఇచ్చేసేవాడే కానీ నాకే చెప్పబుద్ధి కాలేదు. చెప్పలేక పోయాననవచ్చు. అతను బిల్లు కట్టినప్పుడు ఏదో గుర్తుకొచ్చినట్టు చెబుదామనుకున్నాను కానీ నోట్లు తీసుకొనేటప్పుడు అతని వేళ్ల తగిలాయి, ఏదో మైకం ఆవహించినట్టయింది. "అసలు ఇన్ని పెయింట్లు కొంటున్నారు కానీ ఎలా వేస్తున్నారో ఏమో, మీ ఇంటికొచ్చి సలహాలు ఇమ్మంటారేమిటి?" అని అన్నప్పుడు వంకర్లు తిరిగిపోకుండా 'అంతకంటేనా' అన్నాడు.

చూస్తున్నాను, నాతో పరిచయమయ్యాక అతనికి ఆత్మవిశ్వాసం పెరిగినట్టుంది. బట్టల మీద శ్రద్ధ పెరిగినట్టుంది. గడ్డం కూడా రోజూ గీస్తున్నాడు, పోనీ రోజూ కాకపోయినా శనివారం మాత్రం తప్పకుండా గీసుకుని వస్తున్నాడు. నేను మిగతా కష్టమర్లను ఎటెండ్ అవుతూంటే శాంపుల్ బిళ్లలు తిరగేస్తూ నా కోసం కాచుకుంటాడు. షెల్ఫ్‌లో డబ్బాల మీద పేర్లు చదువుతూ కాలక్షేపం చేస్తూ ఉంటాడు.

సుబ్బరత్నం గారు మహా కుళ్లుబోతు. "ఏం కావాలో చెప్పండి" అని సతాయిస్తూంటుంది. నాకు అతని మీద ఇంట్రస్టు ఉన్నట్టు పసిగట్టినట్టుంది. మొన్నోసారి "అతనికి రేట్లు తక్కువగా వేస్తున్నట్టున్నావు" అంది. "రెగ్యులర్ కష్టమరు కదా. వాళ్లింటి దగ్గరే నాలుగు షాపులున్నాయిట. మనం రీజనబుల్‌గా ఇస్తామని మన దగ్గరకే వస్తున్నాడు..." అన్నాను.

"అదేం కాదు, వాళ్ల ఫ్యాక్టరీకి మన షాపు దగ్గిర వెళ్లేదారే కదా అని వస్తాడు. రేటు నచ్చకపోతే మానేస్తాడు. బిజినెస్ పోతే నష్టపోయేది షావుకారు గారు. తక్కువ రేట్లేస్తే నీ దగ్గిర వసూలు చేయాల్సి వుంటుంది."

"మీ ఇష్టం వచ్చినట్టు చేయండి" అని సంభాషణ తుంచేసాను. రేటు ఎక్కువని అతను రావడం మానేస్తే నష్టం షావుకారు ఒక్కడికే కాదు.

అతను నా కోసమే వెయిట్ చేస్తాడన్నది నాకు మహా సంతృప్తి కలిగించే విషయం. నేను ఇస్తున్న ప్రోత్సాహంతో సోఫా పెయింటింగు అయిపోయాక కిటికీలకు, డోర్‌కు, ఆ పైన వాషింగుమెషిన్‌కు, బియ్యం డ్రమ్ముకు అన్నిటికీ వేసేస్తున్నాడు. నాబోటి ఆడది వెంటనుంటే మగాడు కొండల్ని పిండికొట్టడూ. మగాడిలో ఎంత శక్తి ఉంటుంది. అతన్ని కదిలించి, విశ్వాసం ఉత్సాహం కలిగించి, ప్రేరేపించగలిగేది ఆడది మాత్రమే. ఇవన్నీ చేస్తూ కూడా తను ఏమీ తెలియని ముగ్ధలా ఉండాలి స్త్రీ.

క్రితం శనివారం అతను అడిగిన పెయింటు డబ్బా లోపల రాక్స్‌లో ఉంది. షాపులో కుర్రాడు లేడు. నాకు అందదు. అతన్నే లోపలికి రమ్మనమన్నాను. అతను మునివేళ్ల మీద నిలబడి పై షెల్ఫ్ లోంచి డబ్బా తీయబోయేడు. కింద పడేయలేదు కానీ నా మీద పడ్డాడు. రాక్‌కీ, అతనికీ మధ్య నేను నలిగిపోయాను. బుచ్చిబాబు సిగ్గుపడి పోయాడు. బెదిరిపోయాడు. క్షమాపణలు చెప్పడం మొదలెట్టాడు. 'సరేలెండి, బయటకు పదండి, మిగతా కష్టమర్లు వస్తారు' అన్నాను.

"నిజంగా చాలా సారీ అండి, కావాలని చేయలేదు. పాపం మిమ్మల్ని బాగా ఒత్తేసాను" అంటున్నాడు అతి సిన్సియర్‌గా. తను ఇక ఉండబట్టలేక పోయాను. కాస్సేపు ఆగితే ఏ వెంకట్రామయ్యగారో లంచ్‌కని లోపలికి వచ్చేస్తారు. గబగబా "నేనేం కష్టపెట్టుకోలేదు. మీకు కష్టంగా ఉందంటే చెప్పండి, మిమ్మల్నీ రాక్ కేసి నలిపేస్తాను' అని అంటూనే బయటకు వచ్చేసాను. సామాన్లు తీసుకొని వెళ్లిపోతూంటే అతనికి నా మాటల్లో కొంటెతనం అర్థమయిందినట్టుంది. వెనక్కి వచ్చి ఓసారి హాయిగా నవ్వేసి వెళ్లిపోయాడు.

ఆ నవ్వు సుబ్బరత్నం కళ్లపడకుండా ఉంటుందా? కష్టమర్లను లోపలికి పిలుచుకెళ్లడమేమిటంటూ నిలదీసింది. 'కుర్రాణ్ని ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకి పంపించారు. నాకు అందదు. నిచ్చెన వేసి ఎక్కడం నాకు సిగ్గు. అందుకని...' అని చెప్పబోయాను.

'సిగ్గు!' అంటూ వెటకారంగా నవ్విందా శూర్పణఖ. చూసి ఉండదులే. అయినా ఏడుపుగొట్టు మనిషిగా. అతని పాతబిల్లులన్నీ పైకి లాగి నేను ఇచ్చిన డిస్కౌంట్లన్నీ లెక్కకట్టింది. నేనే కట్టాల్సి వచ్చింది. షావుకారు గారికి ఈవిడ మాట వేదవాక్కు. ఆయనతో చెప్పి ప్రయోజనం లేదు. మొత్తం ఏభైయారు రూపాయలు కట్టేశాను. ఈ నెలంతా ఇంటికి నడిచి వెళ్లాల్సిందే. ఈసురోమని నడుస్తూంటే అనుకోకుండా దక్కిన అతని కౌగిలి బిగి గుర్తుకొస్తే చాలు కాళ్లనొప్పి ఎగిరిపోయేది. రావిశాస్త్రి గారి కథ ఏదో ఉండాలి. ఓ కుర్రాడు అనుకోకుండా ఓ ఆంగ్లో ఇండియన్ అమ్మాయికి పరిచయమవుతాడు. ఆ ఉత్సాహంతో ఇంటి దగ్గిర మామకూతురితో సరసమాడతాడు. ఇక్కడ రెండు పాత్రలూ తనే పోషిస్తోందన్నమాట.

కానీ అది జరిగిన తర్వాతి శనివారం అతను రాలేదు. సుబ్బరత్నం మహా హుషారుగా ఉంది. "ఏమిటి విజయా, చాలా డల్‌గా వున్నావు" అంటూ జోకులు. ఆవిడ జోకులు వేయడం ఇదే ప్రథమం. ఇదే ఆఖరు కూడా కావాలి. పై శనివారం అతను తప్పకుండా రావాలి. వచ్చి తనను హోటల్‌కి రమ్మని ఈవిడ ఎదురుగానే పిలవాలి. అప్పుడు చూడాలి ఆవిడ ముఖం.

అతను తన యింటికి తీసుకెళ్లి 'ఇదిగో నువ్వు ఐడియా చెప్పిన ప్రకారమే చేసా చూడు' అని ఇంట్లో ఫర్నీచరంతా చూపించాలి. వద్దు, వద్దు. అప్పుడే రూముకి వద్దు. ఒంటరిగా ఉంటున్నాడు. అక్కడికి వెళితే తనను తానే నిగ్రహించుకోలేకపోతే...? బుచ్చిబాబుకి కూడా తనను చూసి పిచ్చి ఎక్కితే...? అమ్మో, మహా డేంజర్. పెళ్లయిన తర్వాతే అవన్నీ. ఈ శనివారం వచ్చి తీరాలి దేవా, నన్ను కాపాడు. లేకపోతే ఈ సుబ్బరత్నం చూపుల్ని భరించలేను. ఉద్యోగం మానేస్తానంతే.

దేవుడు నా ప్రార్థన విన్నాడు. అతను వచ్చాడు. చేతిలో పూలు కూడా ఉన్నాయి. తెచ్చి, "హేపీ బర్త్‌డే" అన్నాడు. నాకు మతిపోయింది. "నా పుట్టినరోజని మీకెవరు చెప్పారు?" అన్నాను. "క్రితం నెల నే వున్నప్పుడే మీకు ఫ్రెండు నుంచి ఫోన్ వచ్చిందిగా, మీరు మాటల్లో మీ పుట్టినరోజు ఫలానా తేదీ అని చెప్పగా విన్నాను. గుర్తుపెట్టుకున్నాను. ఏమీ అనుకోకపోతే తీసుకోండి." అన్నాడు. ఖర్మ, సుబ్బరత్నం గారు దగ్గర్లో లేదు. మొహం మాడిపోయి ఉండేది.

"నేనంటే ఎందుకండీ ఇంత ఇది" అన్నాను పూలు తీసుకుంటూ. ఆ 'ఇది' ఏమిటో అతను చెప్పాలి గానీ నేను అనకూడదుగా.

"భలేవారే, మా సుశీల నన్ను మెచ్చుకుందంటే మీరేగా కారణం. అసలు నేనెందుకూ పనికిరాని చవటననీ, నాకేమీ టేస్టులేదనీ తనకు బాగా నమ్మకం. మీరిచ్చిన ప్రోత్సాహంతో ఇంట్లో అన్నిటికీ పెయింటు వేసేసాగా, తను ముగ్ధురాలైపోయింది. నన్ను చూసి మురిసిపోయింది. అసలింత బాగా..."

"సుశీల ఎవరు?" అని నాలుక తడి ఆరిపోతూండగా.

"ఓ సారి చెప్పానుగా, నా ఫియాన్సీ అని. తాంబూలాలు ఇంకా పుచ్చుకోలేదనుకోండి..."

చెప్పలేదురా బుచ్చిబాబూ అనాలనిపించింది. అన్నా తను వినిపించుకొనేట్టు లేను. తన సుశీల గురించి ఏదో చెప్పుకుపోతున్నాడు. సుబ్బరత్నం లోపల్నుంచి వచ్చి మాటలు వింటోంది. వీపు తిప్పకుండానే

ఆమె వంకర నవ్వు నాకు కనబడుతోంది. నల్ల పెయింటు పట్టుకొచ్చి ఇతనికి పూసేయాలనిపిస్తోంది. ఉప్పుకాగితం పెట్టి మొహం అంతా రుద్దేద్దామనిపిస్తోంది. ఓ ఆడపిల్లను ఊరించిన పాపం ఊరికే పోతుందా? ఆ సుశీల వీణ్ని వదిలేసి పోతుందిలే. సుశీల, దుశ్శీల, పేరే బాగోలేదు. ఇతని పేరేమిటో. ఏమయితేనేంలే. పూలగుత్తి పక్కన పడేసి ఓ వెర్రినవ్వు నవ్వేను అతనికేసి చూసి. అంత హుషారుగా మాట్లాడుతున్నవాడూ నేనలా నిస్సారంగా కనబడగానే సడన్‌గా బుచ్చిబాబు ఐపోయేడు. "వస్తానండీ" అంటూ వెళ్లిపోయాడు. నాకు ఏడుపొస్తోంది, లోపల్నుంచి తన్నుకువస్తోంది.

వెళుతూ, వెళుతూ గుమ్మం దగ్గిర ఆగేడు. ఏదో గుర్తొచ్చినట్టు వెనుదిరిగేడు. "ఏమండీ" అంటూ నా దగ్గరికి వస్తున్నాడు. ఎందుకంటారు? ఇంకా పెయింటు కొనాలనా? ఒకవేళ సుశీల అతనికి నచ్చలేదేమో, కుటుంబంలో పెద్దల ఒత్తిడికి తల ఒగ్గి ఒప్పుకున్నాడేమో. నన్ను చూసాక ఉద్దేశ్యం మార్చుకున్నాడేమో. నన్ను హోటల్ కాఫీకి రమ్మని పిలిచి, 'మీరు ఔనంటే సుశీల సంబంధం వద్దని మా వాళ్లకి రాసేస్తా, ఏమంటారు?' అని అంటాడేమో. లేకపోతే వెనక్కి ఎందుకు రావాలి చెప్పండి. ఇలా ఊహించడం, కలలు కనడం పొరబాటంటారా? ఎంతైనా ఆడపిల్లని కదా...

●

(ఆంధ్రప్రభ వీక్లీ మే 1998)